ఉద్యమకారులకు ఘన సన్మానం

మహబూబాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని హామీల అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత జాతీయ జెండాతోపాటు, పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పలువురు ఉద్యమకారులను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్పర్సన్ ఆంగోత్ బిందు మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు గుడిపూడి నవీన్‌రావు, శ్రీనివాస్, భరత్‌కుమార్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

గార్ల: తెలంగాణ ఉద్యమకారులను యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వర్తకసంఘం భవనంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూగులోత్ శ్రీను మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యమకారులకు సంక్షేమ పథకాల అమలులో మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ నవీన్‌యాదవ్, ఉద్యమకారులు సక్రు, శ్రీను, మురళీ, శంకర్, జంపాల వెంకన్న, కుమార్ గౌడ్, నాగేశ్వరరావు, జగదీష్, ప్రశాంత్, ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామంలో తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా గ్రామంలోని ఉద్యమకారులకు సోమవారం బీజేపీ నాయకుడు పాలంపల్లి రమణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భరత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చిన్న మహేష్, శోభన్, నాయకులు, బీష్మ సత్యనారాయణ, మధు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.


గార్ల: ఉద్యమకారులను సన్మానిస్తున్న నాయకులు


మహబూబాబాద్: ఉద్యమకారులను సన్మానిస్తున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత


దంతాలపల్లి: ఉద్యమకారులను సన్మానిస్తున్న నాయకులు

క్లుప్తంగా

జాప్యం లేకుండా సర్టిఫికెట్లు ఇవ్వాలి

కురవి: దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు సకాలంలో కులం, ఆదాయ, నివాస సర్టిఫికెట్లు ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం అవసరమయ్యే సర్టిఫికెట్ల జాప్యం కావడం వల్ల విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

సీఎం జగన్ గెలుపు ఖాయం



మహబూబాబాద్ రూరల్: ఎన్ని కూటములు ఏకమైనా ఏపీకి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యేది వైఎస్.జగన్మోహన్ రెడ్డి అని జిల్లాకు చెందిన వైఎస్సార్ అభిమాని గుగులోత్ రాములునాయక్ అన్నారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో రెండోసారి జగన్ సీఎం కావాలని కోరుతూ సోమవారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీ వివేకానంద విద్యాలయంలో (1989–98) చదివిన విద్యార్థులు సోమవారం పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కిశోర్, సంతోష్, మహిపాల్, భిక్షపతి, రాజారామ్, సుమన్, ఏకనాథ్, గీత, సంధ్య, స్వప్న, రాధిక, శివ రామ్‌కృష్ణ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వమట్టి చోరీ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు



డోర్నకల్: డోర్నకల్ మండలం టేకులతండా సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వ మట్టిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. ఎస్సారెస్పీ కాల్వకు ఇరువైపులా కట్ట నిర్మాణం చేపట్టారు. కాల్వ మధ్య నుంచి ఇరువైపులా 40 అడుగుల వరకు స్థలంలో కాల్వతోపాటు కట్ట నిర్మాణం చేపట్టారు. చాలా ప్రాంతాల్లో కట్టను తవ్వి స్థలాన్ని ఆక్రమించారు. కాల్వకు ఇరు ప్రక్కలా నాణ్యమైన మొరంతో కట్ట నిర్మాణం చేపట్టడంతో గుర్తు తెలియని వ్యక్తులు కట్టను తవ్వి మొరంను అక్రమంగా తరలిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని చాలా ప్రాంతాల్లో ఎస్సారెస్పీ కాల్వ స్థలాలు ఆక్రమణకు గురవగా కొన్ని ప్రాంతాల్లో కాల్వ మట్టి చోరీ చేశారు. దీనిపై ఎస్సారెస్పీ ఏఈ హార్థిక దృష్టికి తీసుకెళ్లగా ప్రస్తుతం తాము ఎన్నికల విధుల్లో ఉన్నామని, కట్ట మట్టి చోరీ చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఏఈ తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు

గార్ల: నకిలీ విత్తనాలు విక్రయించిన విత్తన డీలర్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు హెచ్చరించారు. సోమవారం గార్ల వర్తకసంఘం భవనం విత్తన డీలర్లతో జరిగిన సమావేశంలో ఎస్సై జీనత్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గడువు తేదీ దాటిన విత్తనాలు విక్రయించరాదని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదు ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు పంట పూర్తయ్యేంత వరకు రశీదును భద్రంగా ఉంచుకోవాలన్నారు. దుకాణాల్లో ధరల సూచిక, విత్తన నిల్వలు ప్రతీరోజు బోర్డుపై రాయాలన్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన బ్రాండెడ్ విత్తనాలు మాత్రమే విక్రయించాలని డీలర్లకు సూచించారు. ఈ సమావేశంలో డీలర్లు లింగాల ఉమేష్, మనోజ్ అగర్వాల్, తిరుపతిరావు, విద్యాసాగర్, హరీశ్, పంతు, గట్టు నరేందర్, తదితరులు పాల్గొన్నారు.


విత్తన డీలర్లతో మాట్లాడుతున్న రామారావు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మరిపెడ/మరిపెడ రూరల్: మరిపెడ మున్సిపాలిటీ కేంద్రం 221 బూత్‌లోని ఇందిరా కాలనీకి చెందిన ఓడపెల్లి వెంకటమ్మ ఇటీవల వేసవిలో వీచిన వడగాలులకు మృతి చెందింది. ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ ఆదేశాల మేరకు బూత్ ఇన్‌చార్జ్ జాటోతు సురేష్ నాయక్ ఆధ్వర్యంలో 25కిలోల బియ్యం సోమవారం అందజేశారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో కోడి మంగమ్మ ఇంటిపైకప్పు ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో లేచిపడింది. ఈ మేరకు స్పందించిన బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు జాటోత్ హరీశ్‌నాయక్ సోమవారం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

పెద్దవంగర: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ముగింపు ఉత్సవాలను బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం మండల కేంద్రంతో పాటు ఉప్పరగూడెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, ఉప్పరగూడెంలో గ్రామ అధ్యక్షుడు నీలం సోమయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్య శర్మ, నాయకులు కనుకుంట్ల వెంకన్న, దుంపల సమ్మయ్య, రెడ్డాబోయిన గంగాధర్, చిలక భిక్షపతి, మాజీ సర్పంచ్ చింతల భాస్కర్, ఉప సర్పంచ్ శ్రీరాం రాము, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

దంతాలపల్లి: నకిలీ విత్తనాలను, ఎరువులను అరికట్టాలని ఏఐకేఎంఎస్ తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు ఊడుగుల లింగన్న అన్నారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో ఆయన తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా లింగన్న మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయలేదన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీతో ప్రభుత్వమే నేరుగా అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర యాకన్న, మనోజ్, సాయిలు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న బాలునాయక్

మహబూబాబాద్ రూరల్: గ్లోబల్ పీస్ ఫౌండేషన్, బాలునాయక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా బాలునాయక్ సోమవారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కురవి గేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జి క్రింద తల దాచుకుని జీవనం గడుపుతున్న నిరుపేదలలు, అనాథలు, వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ వేణు గోపాల్ నాయక్, భూక్యా సురేందర్ నాయక్, భూక్య సురేష్, సాయి, భరత్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సాగు పనులు షురూ..

పెద్దవంగర: వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఊరట లభించింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. తొలకరితో రైతులు పొలంబాట పట్టారు. దీంతో మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వారం క్రితమే చేలను చదును చేసుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు తాజాగా కురిసిన వర్షానికి విత్తనాలను విత్తుకున్నారు.

కేసముద్రం: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన తొలకరి వర్షంతో ఆయా గ్రామాల్లో రైతులు సోమవారం పత్తి విత్తనాలు వేసే పనిలో మునిగిపోయారు. ఇప్పటికే ముందస్తుగా దుక్కులు దున్నిన రైతులు ఈ వర్షంతో పత్తి విత్తనాలు విత్తారు. దీంతో అంతటా సాగు పనులు షురువయ్యాయి. కాగా రాత్రి సుమారు 54.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు అధికారులు తెలిపారు.


పెద్దవంగర: రామచంద్రు తండాలో పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు

సీజనల్ వ్యాధులపై అవగాహన

నెహ్రూసెంటర్: ప్రజలు వర్షాకాలం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి కిరణ్మయి సూచించారు. జిల్లా కేంద్రంలోని రాంచంద్రాపురం, గుమ్ముడూర్ పరిధిలోని ప్రజలకు సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఎన్సీడీ స్క్రీనింగ్, చికిత్స, అభా కార్డుల లింకు చేస్తూ వ్యాధులపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. జ్వరాలు వచ్చిన వెంటనే సమీపంలోని పీహెచ్‌సీ, ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ ఒబిలిశెట్టి రామకృష్ణ, నర్సు విజయకుమారి, సుమలత, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

పంపిణీకి పాఠ్యపుస్తకాల సిద్ధం



డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠ్యపుస్తకాలు సిద్ధమయ్యాయి. నాలుగు రోజుల క్రితం పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకోగా పాఠశాలల వారీగా పంపిణీ చేసేందుకు సిద్ధః చేస్తున్నారు. ప్రస్తుతం మండలానికి 1నుంచి 10వ తరగతి విద్యార్థులకు 12,492 పుస్తకాలు కేటాయించగా 90శాతం మేర కేటాయింపు జరిగినట్లు ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

మహబూబాబాద్: ఈదురు గాలులతో కూడిన వర్షానికి చెట్లు విరిగి పడడంతో పాటు విద్యుత్ స్తంభాలు కూడా విరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి కొంత ఉపశమనం పొందినా గాలులతో విద్యుత్ స్తంభాలు విరిగి, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. గాలులకు విద్యుత్ శాఖ అధికారులు ముందుగానే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సుమారు రెండు గంటల తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

కురవి: మండల కేంద్రంతోపాటు నేరడ శివారు చీమ్లా తండాలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురియడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చీమ్లాతండాలో గాలి దుమారానికి మూడ్ సుందర్‌కు చెందిన పశువుల కొట్టానికి వేసిన షెడ్డు రేకులు, భూక్య రవి అనే రైతుకు చెందిన పశువుల కొట్టం రేకులు ఎగిరిపడ్డాయి. గ్రామం మొదట్లో భారీ వృక్షం నేలకూలి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో అదే రాత్రి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణి స్పందించి రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టును తొలగించి రోడ్డును క్లియర్ చేశారు. ఎగిరిపడిన రేకులను తీయించి ఎవరికి ఇబ్బంది ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. గాలిదుమారం, భారీ వర్షం రైతులకు నష్టం తెచ్చింది.

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో కొమ్ము లచ్చయ్య, శ్రీధర్, ఏకాంతం, ఇంటికన్నెలో ఐలమ్మ ఇంటిపైకప్పు లేచిపడ్డాయి. వర్షంతో ఇంట్లో ఉన్న సామగ్రి తడిసిముద్దయ్యాయి. అదే విధంగా మండల కేంద్రంలో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో తీగలు తెగిపడ్డాయి, విద్యుత్‌స్తంభాలు కొన్ని చోట్ల విరిగాయి. దీంతో రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

చిన్నగూడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పలు చోట్ల చెట్లు కూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి.


మహబూబాబాద్: 26వ వార్డు పరిధిలో విద్యుత్ స్తంభంపై పడిన చెట్టు


కేసముద్రం: ఈదురుగాలులతో ఎగిరిపోయిన రేకులు


కురవి: చీమ్లా తండాలో గాలికి ఎగిరిపడిన రేకులు

ఘనంగా గంగమ్మ తల్లికి బోనాలు



కురవి: మండల కేంద్రంలో యాదవ కులుస్తుల ఇష్టదైవం గంగమ్మ తల్లికి సోమవారం ఘనంగా గంపలతో బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మేళతాళాలు, యాదవుల సంప్రదాయ వేషాధారణలు, చప్పుళ్లతో బోనాలతో గ్రామం నుంచి పెద్ద చెరువు వద్ద ఉన్న గంగమ్మ తల్లి ఆలయానికి భారీ ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో కులపెద్దలు పుణ్యపుర్తి వీరన్న, కాట్యాల రమేష్, ఐలయ్య, రాజన్న, సీతయ్య, తరాల వీరన్న, బాలరాజు, పుణ్యపుర్తి రాము పాల్గొన్నారు.

రుణమాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలి

గార్ల: రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేసి, కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం గార్లలోని నాగార్జున గ్రామీణ బ్యాంకు ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టిబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. ఖరీఫ్ ప్రారంభం అవుతున్న తరుణంలో రైతులకు ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. రుణమాఫీ ఆలస్యం అవడంతో రైతులపై వడ్డీభారం పెరిగిపోతుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కోసం రైతుబంధు పథకం రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రంను బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, వీరన్న, బీమ్లా, కృష్ణయ్య, నగేష్, ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

విద్యుదాఘాతంతో జీవాల మృతి


గార్ల: మృతి చెందిన ఆవు వద్ద విలపిస్తున్న మహిళా రైతు


మరిపెడ రూరల్: చింతలగడ్డతండాలో..


డోర్నకల్: గోదాతండాలో..


మహబూబాబాద్ రూరల్: కొమ్ముగూడెంలో..

గార్ల: విద్యుదాఘాతంతో గుర్రై పాడి ఆవు మృతిచెందిన సంఘటన సోమవారం కేశోత్‌తండాలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గార్ల మండలం చిన్న బంజర పంచాయతీ కేశోత్‌తండాకు చెందిన కేశోత్ బుజ్జి ఆవును ఉదయాన్నే మేతకు వదిలిపెట్టింది. తెగిపడి ఉన్న విద్యుత్ తీగను ఆవు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపింది.

మరిపెడ రూరల్: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలం చింతలగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రేఖ్యతండాలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. రేఖ్యతండాకు చెందిన రైతు బానోతు రవి తన పశువులు గడ్డి మేయడానికి గ్రామ శివారులోకి వెళ్లాయి. అక్కడ గడ్డి మేస్తున్న క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆవు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

డోర్నకల్: మండలంలోని హూన్యాతండా గ్రామపంచాయతీ పరిధిలోని గోదాతండాకు చెందిన రైతు భూక్య మంగీలాల్‌కు చెందిన ఆవు సోమవారం తండా సమీపంలో మేతకు వెళ్లింది. తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి షాక్‌తో మృతి చెందింది. ఆవు ఖరీదు రూ.60వేలు ఉంటుంది అని రైతు తెలిపాడు.

పిడుగుపాటుకు ఆవు, దూడ మృతి

మహబూబాబాద్ రూరల్: వర్షం కారణంగా మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన రైతు బానోతు మాలు ఇంటి ఆవరణలోని చెట్టుకింద ఉన్న షెడ్డులో కట్టి ఉంచిన పాడి ఆవు, దూడ పిడుగుపాటుకుగురై ఆదివారం రాత్రి మృతిచెందాయి. లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితులు విలపించారు.

ఘన నివాళి

నెహ్రూసెంటర్: సీపీఐ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు పార్థసారథిరెడ్డి సేవలు చిరస్మరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం పార్థసారథిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, పాండురంగాచారి, నవీన్, శ్రావణ్, అశోక్, రవీందర్, నాగార్జున పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పార్థసారథి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శేఖర్, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్‌స్టాలిన్, సాయిచరణ్, లింగస్వామి పాల్గొన్నారు.